
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 7
శుక్రవారం 15 ఆగస్టు 2025



మా తుర్యే సలాం..



'మా తుర్యే సలాం'.. అంటూ దేశ సరిహద్దు రాష్ట్ర జమ్మూ కశ్మీర్‌లో రాయలసీమ పౌరుషం చూపించారు. అరాచక శక్తులు, విద్రోహుల అణిచివేతలో, శాంతిభద్రతల పరిరక్షణలో తనదైన ముద్ర వేశారు. అత్యుత్తమైన 'రాష్ట్రపతి పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంటరీ' (శౌర్య పతకం) అవార్డుకు ఆరు సార్లు ఎంపికయ్యారు శ్రీనగర్ సీనియర్ ఎస్పీగా పనిచేస్తున్న కర్నూలుకి చెందిన డాక్టర్ జీవీ సందీప్ చక్రవర్తి. న్యూఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో జరిగే 79వ స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా అందుకోబోతున్నారు.

- కర్నూలు, (ఆంధ్రజ్యోతి)

తల్లిదండ్రుల కోరిక మేరకు..

కర్నూలుకి చెందిన రిటైర్డ్ ఆర్ఎంవో డాక్టరు జీవీ రామగోపాల్‌రావు, పీసీ రంగమ్మ (ఆరోగ్యశాఖ రిటైర్డ్ అధికారిణి) దంపతుల సంతానం డాక్టర్ జీవీ సందీప్‌చక్రవర్తి. స్థానిక మాంటెస్సోరి హైస్కూల్‌లో పదో తరగతి వరకు చదువుకున్నారు. హైదరాబాదులోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ (బైపీసీ) పూర్తిచేశారు. ఎంసెట్‌లో ర్యాంకు సాధించి కర్నూలు మెడికల్ కళాశాల (కేఎంసీ)లో సీటు సాధించారు. ఎంబీబీఎస్ పూర్తిచేసి డాక్టరు పట్టా అందుకున్నారు. వైద్యవృత్తిని ఎంచుకోకుండా తల్లిదండ్రుల కోరిక మేరకు సివిల్స్ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. తొలి ప్రయత్నంలోనే సివిల్స్-2014లో ప్రతిభ చూపించారు. ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో జాతీయ పోలీస్ శిక్షణ సంస్థ (నేషనల్ పోలీస్ అకాడమి)లో ఐపీఎస్ శిక్షణ పూర్తిచేశారు.



- శ్రీనగర్‌లో సీనియర్ ఎస్పీగా సీమ వాసి డాక్టర్ జీవీ సందీప్‌చక్రవర్తి
- విద్రోహశక్తుల అణిచివేతలో శౌర్యం
- శౌర్య పతకం అవార్డుకు ఆరుసార్లు ఎంపికైన తెలుగు తేజం
- నేడు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రదానం

సీమ పౌరుషం పుణికి పుచ్చుకోవడంతో..

జమ్మూ కశ్మీర్ ఐపీఎస్ క్యాడర్‌గా ఎంపికై శ్రీనగర్ అడిషినల్ ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు సందీప్‌చక్రవర్తి. రాయలసీమ పౌరుషం అణువణువు పుణికి పుచ్చుకోవడంతో ఎక్కడా అధైర్య పడకుండా ఓవైపు శాంతి భద్రతలు పరిరక్షణ, మరో వైపు అరాచకశక్తులు, విద్రోహులను అణిచివేస్తూ దేశ సరిహద్దుల్లో తెలుగువాడి సత్తా ఏమిటో చూపించారు.

శభాష్ అనిపించుకున్నారు..

విద్రోహుల ఏరివేతలో సైన్యానికి (ఆర్మీ)కి సంపూర్ణ సహకారం అందిస్తూ శభాష్ అని పించుకున్నారు. శ్రీనగర్, పూంచ్, ఉరి, సోపోర్, బారాముల్లా, హండ్‌వారా, కుప్వారా వంటి ప్రాంతాల్లో అడిషిన్ ఎస్పీ, ఎస్పీ, సీనియర్ ఎస్పీగా సేవలు అందించారు. 2017లో ప్రతిష్టాత్మకమైన శౌర్య పతకానికి తొలిసారిగా ఎంపికయ్యారు. ఇప్పటికే ఐదు సార్లు రాష్ట్రపతి నుంచి పోలీస్ మెడల్ అందుకున్నారు. తాజాగా ఆరో సారి ఎంపిక కావడం తెలుగువారికి దక్కిన అరుదైన గౌరవం ఇది.

15 ఏళ్ల సర్వీస్.. 17 అవార్డులు



- 15 ఏళ్ల సర్వీస్‌లో పోలీస్ శాఖలో అత్యుత్తమైన వివిధ అవార్డులు 17 అందుకోవడం తెలుగు వారికే గర్వకారణం.
- ప్రతిష్టాత్మకమైన శౌర్య పతకం అవార్డును ఇప్పటికే ఐదు సార్లు అందుకున్నారు. నేడు ఆరో సారి అందుకోబోతున్నారు.
- జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం ఇచ్చే జేఎం పోలీస్ మెడల్ ఫర్ గ్యాలెంట్రీ పతకాలు నాలుగు సార్లు అందుకున్నారు.
- ఏడు సార్లు ఇండియన్ ఆర్మీ చీఫ్ కమండేషన్ డిస్క్, నార్తర్న్ ఆర్మీ కమాండ్ కమండేషన్ డిస్క్, జమ్మూ కశ్మీర్ డీజీపీ కమండేషన్ డిస్క్, సీఆర్‌పీఎఫ్ అండ్ ఐటీబీపీ కమండేషన్ డిస్క్ పతకాలు అందుకున్నారు.

ఇంతకంటే సంతోషం ఇంకేముంటుంది

మా కుమారుడు ఐపీఎస్ అధికారిగా రాణించడమే కాదు.. పలువురు చేత శభాష్ అనిపించుకుంటున్నారు. పోలీస్ శాఖలో ఎంతో ప్రతిష్టాత్మకమైన రాష్ట్రపతి పోలీస్ మెడల్ ఆరు సార్లు అందుకోవడం ఎంతో గొప్ప విషయం. అంతేకాదు.. వివిధ అవార్డులు ఎన్నో అందుకున్నారు. తల్లిదండ్రులకు ఇంతకంటే సంతోషం ఇంకేముంటుంది. ● డాక్టర్ జీవీ రామగోపాల్‌రావు దంపతులు, కర్నూలు


స్వాతంత్ర్య దీప్తి.. సంగ్రామ స్ఫూర్తి..



- త్యాగధనుల ఖిల్లా.. కందనవోలు జిల్లా
- చెరిగిపోని మహనీయుల అడుగు జాడలు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బ్రిటీషు వారి దాస్య శృంఖలాల నుంచి భారత మాత విముక్తికి పోరాడిన వీరుల ఖిల్లా కర్నూలు జిల్లా. తెల్లదొరలు సాగించిన దారుణ పాలనపై గొంతెత్తి సింహాల్లా గర్జించిన ధీరుల జిల్లా ఇది. చరిత్రలో లిఖించిన 1857 సిపాయిల తిరుగుబాటుకు పూర్వమే చరిత్రకెక్కని రైతాంగ పోరాటం ఈ జిల్లాలో జరిగింది. ఈస్ట్ ఇండియా కంపెనీపై 1801లో తొలిసారిగా తిరుగుబాటు బావుటా ఎగురవేసిన స్మరణీయుడు ముతుకూరి గౌడప్ప. వహాబీ ఉద్యమ స్ఫూర్తితో ఆంగ్లేయులపై 1839లో యుద్ధ భేరి మోగించిన చారిత్రక పురుషుడు కర్నూలు నవాబు గులాం రసూల్‌ఖాన్. బ్రిటీషు దొరల అరాచకత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసి, 1846-47 కాలంలో మడమ తిప్పని పోరాటం చేసిన యుద్ధ యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి. ఇలా ఎందరో తొలితరం త్యాగధనులు వీరోచిత పోరాటాలతో మన కళ్లముందు నిలిచిపోతారు. మలితరం సంగ్రామంలో గాంధీజీ చూపిన అహింసా మార్గంలో శాంతియుత ఉద్యమాలు చేసి జైళ్లలో జీవితాలను గడిపిన మహనీయులున్నారు. వారిలో జిల్లా నుంచి గాడిచర్ల హరి సర్వోత్తమరావు, కాదర్‌బాద్ నరసింగరావు, మేడం వెంకయ్య శెట్టి, బియాబానీ, ముచ్చుకోట వెంకట్రామయ్య, వనం శంకర శర్మ, ధరణి రామచంద్రరావు, నివర్తి వెంకటసుబ్బయ్య, సర్దార్ నాగప్ప, అమరావతమ్మ, యాళ్లూరి స్వామిరెడ్డి, గామాగో, దామోదరం సంజీవయ్య, గుర్రం వెంకటరెడ్డి, పెండేకంటి వెంకటసుబ్బయ్య బ్రిటీషు వారిని ఎదురించి లాఠీ దెబ్బలు తిన్నారు. కారాగారాల్లో చిత్రహింసలు అనుభవించారు. తమ జీవితం తోపాటూ ఆస్తిపాస్తులను కూడా సంగ్రామ స్ఫూర్తికే అంకితం చేశారు. శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అలనాటి స్ఫూర్తి ప్రదాతల త్యాగనిరతిపై ప్రత్యేక కథనం.

తెల్లదొరలపై తిరబడ్డ గౌడప్ప




దత్త మండలాల్లో బ్రిటీషు వారిపై తొలి తిరుగుబాటు బావుటా ఎగురవేసి, రైతాంగ పోరా టానికి నాంది పలికిన ఘనత దేవనకొండ మండలం తెర్నేకల్లు గ్రామ పెద్ద ముతుకూరి గౌడప్పకు దక్కుతుంది. బ్రిటీషు వారితో పదిహేను రోజులు యుద్ధం చేసి ఉరికంబం ఎక్కాడు. నిజాం బ్రిటీషు వారితో సైన్య సహకార పద్ధతికి ఒప్పుకొని, కొంతకాలానికి సొమ్ము చెల్లించలేక డబ్బుకు బదులు బళ్లారి, అనంతపురం, కడప, కర్నూలు ప్రాంతాలను వారికి దత్తత ఇచ్చేశాడు. దీంతో ఈ ప్రాంతాలు దత్త మండలాలుగా పేరు పడ్డాయి. దత్త మండలానికి మొత్తం కలెక్టరేట్‌గా అనంతపురం ఉండేది. సీమలో కరువుతో తక్కువ పన్ను వసూలయ్యేది. 50 శాతం పన్ను అదనంగా పెంచారు. దీన్ని వ్యతిరేకించిన గౌడప్ప బ్రిటీషు సైన్యంతో తలపడ్డాడు. 15 రోజుల పాటూ జరిగిన యుద్ధంలో 40 మందికి పైగా గ్రామస్థులు చంపబడ్డారు. చివరికి గౌడప్ప బ్రిటీషు వారికి చిక్కి ఊరి వాకిలి ముందు ఉరి వేయబడ్డాడు. 'తెరిణెకంటి ముట్టడి'గా ఈ పోరాటాన్ని పిలుస్తారు.

స్వరాజ్య నిధికి వందల ఎకరాలిచ్చిన బియాబానీ




'ఆంగ్లేయుల వద్ద బానిసగా పనిచేయను..' అంటూ ప్రకటించిన దేశభక్తుడు బియాబానీ. పదవులు, మహాత్మాగాంధీ ఆశయాలను పాటిస్తూ తనకున్న ఐదు వందల ఎకరాలపైగా భూమిని విరాళంగా ఇచ్చివేసిన మహాదాత బియాబానీ. కర్నూలు జిల్లా చరిత్రలోనే ఇంత భూమి విరాళం ఇచ్చిన దాత ఇప్పటివరకు ఎవరూ లేరు. 1923లో జాతీయ పతాక, సత్యాగ్రహ ఉద్యమంలో బియాబానీ పాల్గొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు.

స్మరణీయుడు నివర్తి వెంకట సుబ్బయ్య



జిల్లాలో స్మరణీయ నాయకునిగా నివర్తి వెంకట సుబ్బయ్య నిలిచిపోతారు. తాలూకా ఆఫీసులోని తన ఉద్యోగానికి రాజీనామా చేసి సాతంత్ర్య పోరాటంలో ప్రవేశించాడు. 1932లో ప్రకాశం పంతులు స్థాపించిన స్వరాజ్య పత్రికలో సంపాదకుడిగా పనిచేశారు. 1936లో వ్యక్తి సత్యాగ్రహం ప్రారంభించగా 1940లో బ్రిటీషు ప్రభుత్వం ఈయన్ను జైలుకు పంపించింది.

అక్షర యోధుడు వనం శంకర శర్మ..



సంఘ సంస్కర్త ధరణి రామచంద్రరావు ప్రజల్లో స్వాతంత్ర్యోద్యమ కాంక్షను రగిలించడానికి, దేశభక్తిని పెంపొందించడానికి అక్షరాలనే ఆయుధాలుగా మలిచి, నిర్భయంగా బ్రిటీషు పాలకుల దమననీతిని నిరసిస్తూ పత్రికను నడిపిన వీరుడు వనం శంకర శర్మ. గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్తగా ధరణి రామచంద్రరావు ఖ్యాతి గాంచారు. పత్తికొండ తాలూకాలోని పి.కోటకొండ గ్రామంలో 1904 ఆగస్టు 4న జన్మించిన ఆయన కర్నూలు మున్సిపల్ స్కూల్‌లో పాఠశాల విద్య, మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాల్లో ఉన్నత విద్య అభ్యసించారు. పత్తికొండలో స్వాతంత్ర్య సమరయోధుడు వనం శంకరశర్మతో ఏర్పడిన సాంగత్యం ఆయన్ను స్వాతంత్ర్య సంగ్రామం వైపు మళ్లించింది. ఐంద్రావతి పత్రికకు ఉప సంపాదకుడిగా పనిచేశారు. గాడిచర్ల హరి సర్వోత్తమరావుతో కలిసి స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.



గులాం రసూల్.. సలాం



కర్నూలు చివరి నవాబు గులాం రసూల్‌ఖాన్. అసమాన పోరాటం చేసి అసువులు బాసిన త్యాగధనుడు. గులాం రసూల్‌ఖాన్ 1792 నుంచి కర్నూలును పాలించిన నవాబు అలూఫ్‌ఖాన్ కుమారుడు. అలూఫ్ ఖాన్ తండ్రి మునవర్ ఖాన్ మరణాంతరం రాజ్యాన్ని పొందగా, అప్పట్లో ఈ రాజ్యం మైసూరు నవాబుల పాలనలో ఉండేది. అలూఫ్ ఖాన్ పాలనలోనే మూడో మైసూరు యుద్ధం కారణంగా ఈ ప్రాంతం నిజాం నవాబు పాలనలోకి వచ్చింది. 1799లో నిజాం నవాబు, ఈస్టిండియా పాలకులు కలిసి శ్రీరంగపట్టణాన్ని ముట్టడించి టిప్పు సుల్తాన్‌ను చంపేశారు. ఈ పరిణామం అనంతరం సైనిక ఖర్చుల కింద కడప, కర్నూలు, బళ్లారి ప్రాంతాలు బ్రిటీషు వారి కిందికి వెళ్లిపోయాయి. గులాం రసూల్‌ఖాన్ చివరి కొడుకు కావడం, ఆయనపై చాలా ప్రేమ ఉన్న అలూఫ్ ఖాన్ నాటి గవర్నర్ మింటోను ఒప్పించి రసూల్ ఖాన్‌ను నవాబు చేశారు. ఈస్టిండియా కంపెనీకి ఆఫ్ఘనిస్థాన్ చక్రవర్తికి యుద్ధం వచ్చింది. ఇందులో ఆఫ్ఘన్ చక్రవర్తి విజయం సాధిస్తారని నమ్మిన రసూల్‌ఖాన్ రహస్యంగా కర్నూలు కోటలో ఆయుధాలు తయారు చేసి, బ్రిటీషు సైన్యాధ్యక్షుడితో పోరాటం చేశాడు. 1839 అక్టోబరు 18న జోహరాపురం వద్ద జరిగిన యుద్ధంలో అనేక మంది నవాబు సైనికులు, ఆంగ్ల సిపాయిలు మరణించారు. చివరకు కర్నూలు నవాబును పట్టి బంధించిన ఆంగ్లేయులు విచారణ పేరుతో తమిళనాడులోని తిరుచునాపల్లి జైలుకు తరలించారు. అక్కడే ఆయనకు ఒక సేవకుడి ద్వారా భోజనంలో విషం పెట్టి చంపించారు.

దేశ సేవలో సర్దార్ నాగప్ప, అమరావతమ్మ



ఆంధ్రా అంబేద్కర్‌గా సర్దార్ నాగప్ప ఖ్యాతి పొందారు. కర్నూలు పట్టణానికి చెందిన సర్దార్ నాగప్ప స్వాతంత్ర్య సమరయోధుడు. జాతీయోద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. 1936లో ఉమ్మడి మదరాసు రాష్ట్రంలో శాసనసభకు ఎన్నికయ్యారు. 1937లో రిజర్వ్‌డ్ స్థానం నుంచి మరలా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బ్రిటీషు వారికి వ్యతిరేకంగా పోరాడినందుకు 1940లో ఒక ఏడాది పాటు బళ్లారి, వేలూరు, తిరుచు నాపల్లి జైళ్లలో కఠిన కారాగార శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్యానంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌తో కలిసి పనిచేసిన తొమ్మిది మంది సభ్యుల్లో ఒకరిగా సర్దార్ నాగప్ప పనిచేశారు. జైలు జీవితం అనుభవించిన నారీమణిగా అమరావతమ్మ నిలిచిపోతారు. పురుషులతో సమానంగా సంగ్రామ పోరాటం చేసి, జైలు జీవితాన్ని అనుభవించిన ధైర్యశాలి ఆమె.



1913లో జన్మించిన అమరావతమ్మ చిన్న వయసులో సర్దార్ నాగప్పను వివాహం చేసుకున్నారు. భర్త చూపిన మార్గంలోనే ఆమె పయనించారు. తానుకూడా మహాత్ముని సూచనలు పాటిస్తూ, స్త్రీలలో జాతీయ భావనలు నింపేవారు. దీంతో ఆమెను కర్నూలు సబ్‌జైలులో 1941లో పది నెలలపాటు కారాగార శిక్ష విధించారు. జైలు జీవితం నుంచి బయటకు వచ్చాక తిరిగి ఆమె క్విట్ ఇండియా ఉద్యమంలో 1942లో పాల్గొని తిరిగి ఏడాది పాటు జైలు శిక్షను అనుభవించారు.

పంద్రాగస్టుకు పటిష్ట ఏర్పాట్లు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భారతదేశ 79వ స్వాతంత్ర్య వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కవాతు మైదానంలో వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ హాజరుకానున్నట్లు తెలిపారు. జాతీయ పతకాన్ని ఎగురవేసి పోలీసు దళ గౌరవ వందనం స్వీకరిస్తారన్నారు. సాయుధ దళాలను పరిశీలించి ఉదయం 9.15గంటలకు మంత్రి జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ సందేశమిస్తారని కలెక్టర్ తెలిపారు.

పరేడ్ రిహార్సల్స్ పరిశీలన

కర్నూలు క్రైం, ఆగస్టు 14 (ఆంధ్ర జ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలోని పరేడ్ మైదానంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్ రిహార్సల్స్‌ను ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం ఏఆర్ అడిషినల్ ఎస్పీ కృష్ణమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య వేడుకలకు పలువురు ప్రముఖులు హాజరవుతున్న సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు.


రాయలసీమ ఐకానిక్



1947 ఆగస్టు 15వ తేదీన కొండారెడ్డి బురుజు వద్ద సంబరాలు



ప్రస్తుతం పంద్రాగస్టు సందర్భంగా ర్యాలీ



త్రివర్ణ శోభితమైన కొండారెడ్డి బురుజు

నీటి వనరుల మరమ్మతులకు చర్యలు

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజలకు, రైతులకు తాగు, సాగునీటికి ఇబ్బందుల్లేకుండా నీటి వనరుల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. గురువారం మినీ కాన్ఫరెన్స్ హాల్లో నీటివనరుల మరమ్మతులు, పునరుద్ధరణ పునర్నిర్మాణం (ఆర్ఆర్ఆర్) పథకం అమలుకు సంబంధించిన జిల్లాస్థాయి అమలు, పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో ఆర్ఆర్ఆర్ పథకం కింద చెరవులు, జలాశయాలు, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు తదితర నీటి వనరులకు (ఆర్ఆర్ఆర్) పనులు చేపడుతారన్నారు. సమావేశంలో జలవనరుల శాఖ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొలను సర్పంచుకు అరుదైన గౌరవం



ఢిల్లీలో కేంద్రమంత్రి నుంచి మెమొంటో అందుకుంటున్న సర్పంచు సుజాతమ్మ

ఓర్వకల్లు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు మండలంలోని పాలకొలను గ్రామ సర్పంచు చదువుల సుజాతమ్మకు అరుదైన గౌరవం లభించింది. దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు గురువారం ఆమె విమానంలో బయలుదేరి వెళ్లారు. ఢిల్లీలో కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేతుల మీదుగా సర్పంచు చదువుల సుజాతమ్మ మెమొంటోను అందుకున్నారు. శుక్రవారం ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో ఆమె పాల్గొంటారు.

శ్రీమఠంలో ముగిసిన సప్తరాత్రోత్సవాలు

- పంచరథ వాహనంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు
- బంగారు పల్లకిపై రాఘవేంద్రుడి విహారం



మంత్రాలయం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాలు వైభవంగా ముగిశాయి. గురువారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పంచవాహన రథానికి పూజలు చేసి ప్రారంభించారు. ఏడు రోజులు జరిగిన సప్తరాత్రోత్సవాలకు పీఠాధిపతి సర్వసమర్పణతో ఉత్సవాలకు ముగింపు పలికారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను వజ్రాలతో పొదిగిన హారాలతో అలంకరించి స్వర్ణ పల్లకిలో అధిష్టించి ఊరేగించి ఊంజల సేవ చేశారు. అనంతరం గజ వాహనం, చెక్క, వెండి, బంగారు, నవరత్నాల రథాలపై ఊరేగించారు. చెక్కరథంపై సంహం, అశ్వ, గజ, స్వర్ణ పల్లకి, పంచ వాహనాలను సుందరంగా తీర్చిదిద్ది వాటి మధ్య రాఘవేంద్రస్వామి నిల్వ ప్రతిమను అలంకరించి అందులో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను అధిష్టించి పీఠాధిపతులు మహామంగళహారతులు ఇచ్చి పంచవాహన రథోత్సవాన్ని ఊరేగించారు. ఈ వేడుకలో పండిత కేసరి రాజా ఎస్.గిరిరాజాచార్, మఠం దివాన్ సుజీంద్రాచార్, ఆనంద తీర్థాచార్, గౌతమాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్, శ్రీపతాచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ఏఈలు బద్రినాథ్, శ్రీహరి, వ్యాసరాజాచార్, బిందు మాధవ్, ద్వారపాలక అనంతస్వామి, జయతీర్థాచార్, వాదిరాజాచార్‌లు పాల్గొన్నారు.

● అలరించిన భరతనాట్యం: ఉత్సవాల ముగింపులో భాగంగా యోగీంద్ర కళామండపంలో గురువారం రాత్రి చెన్నైకి చెందిన చిత్రామయ డ్యాన్స్ స్కూల్ బృందం ప్రదర్శించిన భరతనాట్యం ఆకట్టుకుంది. బెంగళూరు చెందిన విద్వాన్ ఎస్‌హెచ్ ప్రసాద్ మండోలిన్ వాయిద్యం, పూణేకి చెందిన ఆనంద్ భీమ్‌సేన్ జోషీచే నిర్వహించిన హిందుస్థాని సంగీతం భక్తులను అలరించింది.

బంగారు పల్లకిలో ఊరేగిన రాఘవేంద్రులు →



నేత్రాల సేకరణ కేంద్రానికి అనుమతి

ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్



సుశీల నేత్రాలయ ఎండీ డాక్టర్ సుధాకర్‌రావుకు అనుమతి పత్రాలిస్తున్న కలెక్టర్

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కర్నూలు సుశీల నేత్రాల, మెటర్నీ హాస్పిటల్‌కు నేత్రాల సేకరణ (ఐబాల్) కేంద్రానికి అనుమతి లభించింది. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రంజిత్ బాషా నేత్రాల సేకరణ కేంద్రానికి అనుమతి పత్రాలను సుశీల నేత్రాల ఎండీ డాక్టర్ పి.సుధాకర్‌రావు, కార్నియా స్పెషలిస్టు డా.పి.రాఘవ ప్రీతమ్‌కు అందజేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఐబాల్ సేకరణ కేంద్రానికి సుశీల నేత్రాలకు అనుమతి లభించడం సంతోషంగా ఉందన్నారు. మరణించిన వ్యక్తి నుంచి కళ్లను ఆరు గంటలలోపు సేకరించాలని, ఈ ప్రక్రియలో సుశీల నేత్రాల ముందు ఉంటుందన్నారు. ఐబాల్‌ను సేకరించిన తర్వాత మా హాస్పిటల్‌లో ఉన్న ఎంకే మీడియంలో భద్రపరుస్తామన్నారు. ఎవరైనా నేత్రదానం చేయ దలచిన వారు 8886306308, 9949546785లను సంప్రదించాలని కోరారు.

మహాసభలను జయప్రదం చేయాలి: సీపీఐ

కర్నూలు అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈనెల 23వ తేదీ నుంచి 25 వరకు జరిగే సీపీఐ రాష్ట్ర 28వ మహా సభలను జయ ప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు. గురువారం సీఆర్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్‌తో కలిసి సమావేశంలో మాట్లాడారు. నాయకులు శ్రీరాములు, శ్రీనివాసులు, రాజీవ్, షాబీర్ బాషా పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

● రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి భరత్

● అధికారులతో సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్, మున్సిపల్ కమిషనర్ పి.విశ్వనాథ్, డీఎస్పీ బాబు ప్రసాద్, డీటీసీ శాంతకుమారి, ట్రాఫిక్ సీఐతోపాటు నగరంలోని సీఐలతో మంత్రి సమీక్ష నిర్వహించారు. టీజీ భరత్ మాట్లాడుతూ నగరంలో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రతరం అవుతుందన్నారు. పాతబస్తీలో వన్‌వే పెట్టడంతోపాటు వన్ సైడ్ పార్కింగ్ పెట్టాలని పోలీసులు సూచించారు. ఆటోల లైన్ ప్రత్యేకంగా పెట్టాల్సి ఉంటుందని, ఇందుకోసం అవసరమైతే మార్కింగ్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. ఇక ప్రధాన రోడ్లలో తోపుడు బండ్లతో ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా వారికి కేటాయించిన ప్రాంతాల్లోనే అమ్ముకునేలా మున్సిపల్, పోలీసులు సమన్వయంతో పని చేయాలన్నారు. రెడ్ జోన్ లిస్టును పోలీసు శాఖకు అందించి ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు చెప్పారు. ఆర్టీసీ బస్సులను నగరంలో నుంచి కాకుండా ఊరి బయట వెళ్లేందుకు ప్రణాళిక తయారు చేయాలని ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులకు సూచించారు. అన్ని బస్సులు బయలు ఒకేసారి బయటకు రాకుండా కొన్నింటిని నగరంలో నుంచి వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ మాటాడుతూ మద్యం దుకాణాలు ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది కలగ కుండా చూడాలని, మద్యం తాగి వాహనాలు నడి పే వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైన అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పెట్టాలన్నారు.

వైసీపీకి ప్రజలే బుద్ధి చెప్పారు

● కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

● జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ విజయంపై సంబరాలు



విష్ణు, ఎమ్మెల్యే దస్తగిరికి కేక్ తినిపిస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని గెలిపించి వైసీపీకి ప్రజలే బుద్ధి చెప్పారని కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని ఆయన నివాసంలో కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరితోపాటు మండలాల నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

ఓర్వకల్లు: మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కంచుకోటకు బీటలు వారాయి. పులివెందుల, ఒంటిమెట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించిందని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఓర్వకల్లులో టీడీపీ విజయంపై కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. బీసీ సెల్ అధ్యక్షుడు అల్లాబాబు, నాయకులు స్వామిరెడ్డి, కోటేశ్వరరావు, అబ్దుల్లా, కురువ నాగరాజు, ఆదామ్, శ్రీరాములు, చంద్రయ్య పాల్గొన్నారు.

గూడూరు: పులివెందులలో జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో జగన్ కోటను టీడీపీ బద్దలు కొట్టి గెలిచిందని పార్టీ మండల అధ్యక్షుడు జె సురేష్ అన్నారు. గురువారం మండలంలోని కె.నాగలాపురంలో పులివెందుల, ఒట్టిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ విజయంపై పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ నాయకులు గోపాల్ రెడ్డి, కేడీసీసీ డైరెక్టర్ అల్లిపీరా, తిరుపాలు, నాగులు, సుంకన్న పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని ఆర్ కానాపురంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు సుమన్ బాబు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. సర్పంచ్ మునిస్వామి, మన్యంకొండ, నరసింహులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలి

కర్నూలు అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నేటి యువత స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలని ఇన్‌చార్జి ఉపకులపతి వి.వెంకట బసవరావు అన్నారు. గురువారం క్లస్టర్ యూనివర్సిటీలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. వెంకట బసవరావు మాట్లాడుతూ విద్యార్థులు సన్మార్గంలో పయనించి దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, డీన్లు అక్తర్‌భాను, నాగరాజు శెట్టి, కంట్రోలర్ బాలసుబ్రహ్మణ్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కర్నూలు కల్చరల్: ప్రజానాట్య మండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలబాలికలతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నగరంలో మద్దూరునగర్ లోగల పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు బసవరాజు ప్రారంభించారు. గాయకులు మహమ్మద్ మియా, సుజాత పాడిన దేశ భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి.

స్వదేశీ వస్తువుల జాగరణ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మన దేశ ఎగుమతులపై అమెరికా అధిక పన్నుల ఆంక్షల నేపథ్యంలో వస్తువుల ఉత్పత్తిలో మేక్ ఇన్ ఇండియా ద్వారా ఆత్మ నిర్భరతను సాధించి స్వదేశీ వస్తువుల వాడకాన్ని ప్రోత్సహించడం ఒక్కటే మనముందున్న మార్గమని పలువురు వక్తలు తెలిపారు. మాంటెస్సోరి విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్థానిక రాజ్‌విహార్ నుంచి మెడికల్ కాలేజీ, కలెక్టర్ కార్యాలయం వరకు విద్యార్థులు స్వదేశీ వస్తువుల జాగరణ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాంటెస్సోరి విద్యాసంస్థల డైరెక్టర్ గాయనీ రాజశేఖర్ కలెక్టరేట్ ఎదుట ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

డైస్‌లో చిన్న పిల్లలకు కార్పొరేట్ వైద్యం

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వ జన వైద్యశాల జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం (డైస్)లో చిన్నారులకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందిస్తున్నామని సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఆయన హాస్పిటల్‌లో ఉన్న జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రాన్ని సందర్శించారు. ప్రతి నెల డైస్ కేంద్రంలో ఎదుగుదల లోపం, వైకల్యం, తదితర సమస్యలతో నమోదు అవుతున్న వివరాలు, వారికి అందజేస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంవో టీసీహెచ్ వెంకట రమణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.పద్మజ, డా.శివబాల, డా.సృజన ఉన్నారు.

స్థల పరిశీలన

కర్నూలు అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం డాగ్ షెల్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని నగర పాలక సంస్థ కమిషనర్ విశ్వనాథం అన్నారు. గురువారం నగర శివారు లోని బస్తిపాడు గ్రామ పంచాయతీ పరిధిలో డాగ్ షెల్టర్ ఏర్పాటుకు పలు ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి ఉన్నారు.

రేపు టీటీడీ ఆధ్వర్యంలో గోపూజ

కర్నూలు కల్చరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ఎంపిక చేసిన నాలుగు ప్రాంతాల్లో గోపూజ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు హెచ్‌డీపీపీ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహ కుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కల్లూరు మండలం పెద్దటేకూరులోని రుక్మిణి పాండురంగ స్వామి దేవస్థానంలో, ఆదోని మండలం సలకలకొండ, నంద్యాలలోని పద్మావతినగర్‌లోగల శ్రీకృష్ణ మందిరంలో, కోవెలకుంట్ల మండలం, రెవనూరు గ్రామంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ఈ గోపూజ కార్యక్రమాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

కేవీఆర్‌లో ముగ్గుల పోటీలు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని సెట్కూరు, కేవీఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల ఆధ్వర్యంలో గురువారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థినులు దేశభక్తి ఉట్టిపడేలా అద్భుతమైన ప్రతిభతో స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపారని ఆర్ఐవో లాలెప్ప, సెట్కూరు సీఈవో వేణుగోపాల్ తెలిపారు. అనంతరం గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ సబీహా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు నృత్య పోటీలు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని శనివారం పాఠశాల స్థాయి విద్యార్థులకు నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీభరతమాత మాతృమండలి కర్నూలు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఇ.పద్మావతి, జయలక్ష్మి తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమీపం లోని శాలమ్మసత్రం సమావేశ హాలులో నృత్య పోటీల వివరాలు తెలియ జేసే కరపత్రాలను వారు విడుదల చేశారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న భరతమాత మాతృమండలి ప్రతినిధులు

'రాహుల్‌గాంధీపై జగన్ వ్యాఖ్యలు దుర్మార్గం'

కర్నూలు అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీపై జగన్ వ్యాఖ్యలు దుర్మార్గమైనవని మాజీ ఎమ్మెల్సీ, మాజీ డీసీసీ ఎం.సుధాకర్ బాబు అన్నారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం కోడుమూరు ఇన్‌చార్జి అనంతరత్నం మాదిగ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నికార్సైన, నీజాయితీపరుడు .. రాహుల్ మోదీ హఠావో.. దేశ్ బచావో అనే నినాదంతో ఎదురించిన ఏకైక నాయకుడు అని అన్నారు. మోదీ, బీజేపీని విమర్శించే ధైర్యంలేని నీవు మాణిక్యం ఠాగూర్ గురించి మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందన్నారు. అనంతరం అనంతరత్నం మాట్లాడుతూ జగన్ తాడేపల్లి, బెంగళూరు ప్యాలెస్‌లకు పరిమితమై, జెండా.. అజెండా లేని నాయకుడు అని మండి పడ్డారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా విజయవాడలో చేపట్టే కాగడాలతో నిరసన కార్యక్రమానికి వైసీపీ మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పులివెందుల్లో జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో కూడా ఘోరపరాజయం పొందిన నీవా కాంగ్రెస్ పార్టీ అధినాయకులను విమర్శించేది అని మండిపడ్డారు. సమావేశంలో ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు బజారన్న, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు ఖాజా హుస్సేన్, సాంబశివుడు పాల్గొన్నారు.

జగన్ బుద్ధి తెచ్చుకోవాలి: ఎంపీ

కర్నూలు అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఫలితంతోనైనా వైసీపీ అధ్యక్షుడు జగన్ బుద్ధి తెచ్చుకోవాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. గురువారం నగరంలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అరాచకానికి, ప్రజాస్వామ్యానికి మధ్య జరిగిన ఎన్నికల్లో ప్రజాస్వామ్యం గెలిచిందన్నారు. వైనాట్ 175 అంటూ వీర్రవీగిన జగన్, తన సొంత నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేక పోయారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పే ఈ విజయమని, అక్కడ టీడీపీ విజయంతో జగన్ కోటకు బీటలు వారాయని అన్నారు.

టిప్పర్లు స్వాధీనం

ఓర్వకల్లు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాయలచెరువు నుంచి ఓర్వకల్లు ఉక్కు పరిశ్రమలకు అనుమతులు లేకుండా తరలిస్తున్న మూడు టిప్పర్లను విజిలెన్స్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. రాయలసీమ నుంచి ఓర్వకల్లు ఉక్కు పరిశ్రమలకు డోలమైట్ డెస్ట్ టిప్పర్లకు ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తుండటంతో స్వాధీనం చేసుకుని ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు విజిలెన్స్ అధికారులు వెంకటేశ్వర్లు, రాజశేఖర్ తెలిపారు.

పోలీసుల నిర్ణయం సరైంది కాదు

కర్నూలు అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నగరంలోకి ఆటోలను అను మతించడం లేదని పోలీసులు తీసకున్న నిర్ణయం సరైంది కాదని ఏఐటీ యూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప అన్నారు. గురువారం నగరంలోని జిల్లా ఏఐటీయూసీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు ఎన్ రాము అధ్యక్షతన జరిగిన సమావేశానికి నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆర్ కృష్ణారెడ్డి హాజరయ్యారు. మునెప్ప మాట్లాడుతూ నగరంలో ఆగస్టు 15 నుంచి 7 సీట్ల ఆటోలను అనుమతించమన్న నిర్ణయం సరైనది కాదన్నారు. నగరంలో సెవెన్ సీటర్ ఆటోలు ఆపినంత మాత్రాన ట్రాఫిక్ సమస్య తగ్గుతుందా అని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సుతోపాటు ఉచిత ఆటో ప్రయాణం కూడా ప్రకటించి ఉండే బాగుండేదని అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఆటో యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.రామాంజనేయులు, బి.నాగ రాజు, సోమన్న, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

చెరువులను నీటితో నింపేలా చర్యలు

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జిల్లాలో ఉన్న అన్ని చెరువులను నీటితో నింపేలా చర్యలు తీసుకుంటున్నామని వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రంజిత్ బాషా ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియజేశారు. గురువారం విజయవాడ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి సాగునీటి సంఘాలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు నుంచి పాల్గొన్న కలెక్టర్ మాట్లా డుతూ హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులు వంద శాతం పూర్తయ్యాయని తెలిపారు. గత సంవత్సరం ఉమ్మడి జిల్లాలో 68 చెరువుల ను మార్చి 31వరకు నీటితో నింపామని, ఈ ఏడాది కూడా 68 చెరువులతోపాటు వాటితో అనుసంధానంగా ఉన్న చెరువులను నింపేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్ లో ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ కబీర్‌బాషా, ఎస్ఈ బాలచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలన్నదే లక్ష్యం: ప్రతి గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. జిల్లాలో గత 77 సంవత్సరాల నుంచి రహదారి సౌకర్యం లేని 14 గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించిన ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంకి, కలెక్టర్‌కు గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంబంధిత గ్రామాల ప్రజలు, పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లు కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ రోడ్లు లేని గ్రామాలకు రోడ్లు వేయించాలన్న సీఎం ఆదేశాల మేరకు జిల్లాలో రూ.120 కోట్లతో గ్రామాల్లో అంతర్గత రోడ్లు, కాలువ నిర్మాణాలను చేపట్టామన్నారు. జిల్లాలో ఈఏడాది 8,500 నీటి కుంటలను నిర్మిస్తున్నామన్నారు.

నిరుద్యోగ యువతకు జాబ్ మేళా

కల్లూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాక్టర్స్ కాలనీలోని బాలుర ప్రభుత్వ కళాశాలలో ఏపీ స్కేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు పలు కంపెనీల ద్వారా మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి దీప్తి, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో మహిళ బలవన్మరణం

ఓర్వకల్లు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ మహిళ ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మండల కేంద్రమైన ఓర్వకల్లులో ఈ ఘటన గురువారం చోటు చేసుకున్నట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు. వివరాలు.. ఓర్వకల్లులోని పెండేకంటి నగర్‌కు చెందిన భారతి(31)ని భర్త భాను ప్రకాష్ మద్యానికి బానిసై ప్రతి రోజు తాగి వచ్చి వేధించేవాడు. గురువారం మధ్యాహ్నం ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇక తన భర్తలో మార్పు రాదని నిర్ధారించుకున్న భారతి ఇంట్లోని ఫ్యాన్‌కు చీర తో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మృతు రాలికి ఇద్దరు చిన్నారులు కుమార్తె, కుమారుడు సంతానం. మృతురాలి తండ్రి రెడ్డిపోగు మాదన్న (మార్క్) ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్యే కోట్లను కలిసిన ఆకెపోగు ప్రభాకర్

గూడూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఆకెపోగు ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం ఆయనతోపాటు మాజీ జడ్పీటీసీ సభ్యులు ఎల్.సుధాకర్ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు ఆర్.చంద్రారెడ్డి, గుడిపాడు విజయభాస్కర్ రెడ్డి, సత్రం రామకృష్ణుడుతో కలిసి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని పూలమాలలతో శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనీ సూచించారు. అనంతరం కర్నూలు పట్టణంలో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్‌ను ఆకెపోగు ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

కల్లూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పార్వతమ్మను ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు గురువారం సన్మానించారు. ఆ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో ప్రతినిధులు పార్వతమ్మను ఆమె ఇంట్లో కలిసి పూలమాలలతో సత్కరించారు. శ్రీనివాసాచారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ అభివృద్ధి సంక్షేమం కోసం యువగళం యాత్రలో మంత్రి నారా లోకేశ్ పాటుపడుతారని హామీ ఇచ్చి మాట నెరవేర్చు కున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీతారామాంజనేయులు, చంద్రసుబ్బారావు, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

'స్త్రీ శక్తి'కి సర్వం సిద్ధం

- కర్నూలు జిల్లాలో 231 బస్సుల్లో సౌకర్యం
- 25 వేలకు పైగా మహిళలు ఉపయోగించుకునే అవకాశం
- సన్నాహాలు చేస్తున్న ఆర్టీసీ అధికారులు
- నేటి నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



కర్నూలు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే స్త్రీశక్తి పథకం అమలుకు శ్రీకారం చుట్టనుంది. శుక్రవారం నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించేందుకు సర్వం సిద్ధంచేశారు. మహిళలకు జీరో చార్జీ టికెట్ ఇస్తారు. కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గ కేంద్రాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, ఆర్టీసీ అధికారులు స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం 5గంటల తరువాత ఈసౌకర్యం అందుబాటులోకి రానుంది. జిల్లాలో దాదాపుగా 25 వేల మందికి పైగా మహిళలు రోజు ఉచిత ప్రయాణం సౌకర్యం పొందే అవకాశముందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు.

పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, అల్ట్రా పల్లెవెలుగు బస్సులు 231

జిల్లాలో కర్నూలు-1, 2, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ ఆర్టీసీ డిపోల పరిధిలో పల్లె వెలుగు నుంచి హైటెక్ సర్వీస్ వరకు వివిధ బస్సులు 390 ఉన్నాయి. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, అల్ట్రా పల్లెవెలుగు బస్సులు 270 ఉన్నాయి. వీటిలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల్లోని అన్ని రూట్లలో వెళ్లే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, అల్ట్రా పల్లెవెలుగు 231 బస్సుల్లో ఉచిత ప్రయాణం ఏర్పాట్లు చేశారు.

ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలో నాన్‌స్టాప్ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉండదు. జిల్లాలో నాన్ స్టాప్ బస్సులను సింగిల్, టూ, త్రీ స్టాప్ బస్సులుగా మార్చాడంతో వాటిలో కూడా ఉచిత ప్రయాణం కల్పిస్తారు. దీంతో సూపర్ లగ్జరీ, అల్ట్రా డిలక్స్, హైటెక్ వంటి బస్సుల మినహా అన్ని రకాల ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఎలాంటి చార్జి చెల్లించకుండా ఉచితంగా ప్రయాణం చేయవచ్చు.

ఆ సర్వీస్‌ల్లో ఉచితం లేదు



అంతర్రాష్ట్ర, ఘాట్ రూట్లలో నడిపే బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం లేదు. కర్నూలు- బళ్లారి వయా ఎమ్మిగనూరు, ఆదోని సర్వీస్ 6 బస్సులు, ఎమ్మిగనూరు-బళ్లారి వయా ఆదోని, ఆలూరు సర్వీస్ 6 బస్సులు, ఎమ్మిగనూరు, ఆదోని నుంచి బెంగళూరు వెళ్లే 5, హైదరాబాద్‌కు వెళ్లే ఒక బస్సు సహా కర్ణాటకలోని సిరుగుప్ప, తెలంగాణ రాష్ట్రంలోని ఐజ, ఘాట్ రూట్ శ్రీశైలానికి నడిపే 39 బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఉండదు.

సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చాం

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న స్త్రీశక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణానికి సర్వం సిద్ధం చేశాం. జిల్లాలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించేలా ఏర్పాటుచేశాం. ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. టిమ్స్‌లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అప్‌లోడ్ చేశాం.

- శ్రీనివాసులు, ఆర్ఎం, ఏపీఎస్ ఆర్టీసీ, కర్నూలు

అదృశ్యమయ్యాడు.. శవమై తేలాడు..

- అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



విశ్వనాథ్ గౌడ్(ఫైల్)

కర్నూలు క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన ఓ యువకుడు హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలో శవమై తేలాడు. అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ విక్రమసింహ తెలిపారు. వివరాలు.. కృష్ణానగర్‌కు చెందిన విశ్వనాథ్‌గౌడ్(34) నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో ఆయన భార్య నాగమణి నాలుగో పట్టణ పోలీసులకు నాలుగు రోజుల క్రితమే ఫిర్యాదు చేసింది. గురువారం కోడుమూరు పరిధిలోని లద్దగిరి వద్ద హెచ్ఎన్ఎస్ఎస్(హంద్రీనీవా సుజలస్రవంతి) కాలువలో శవమై కనిపించాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచామివ్వగా వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు ఓ దినపత్రికలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈయనకు కొడుకు, కూతురు ఉన్నారు. ఆయన మృతిపై పోలీసులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నంద్యాలకు చెందిన కొంత మందికి అధిక వడ్డీలకు కొంత మొత్తాన్ని అప్పులు ఇచ్చారు. తిరిగి ఇవ్వకుండా సతాయిస్తుండటంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. సఫా కాలేజీ హెచ్ఎన్ఎస్ఎస్ సమీపంలో బైక్ లభ్యమైంది. ఎవరైనా నదిలోకి తోసి ఆయన మృతికి కారణమై ఉంటారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పెయింటర్ బలవన్మరణం



బోయ రమేష్ (ఫైల్)

మంత్రాలయం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన పెయింటర్‌గా పనిచేస్తున్న బోయ రమేష్(36)అనే వ్యక్తి గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య రంగమ్మ పొలం పనులకు వెళ్లిన తర్వాత ఇంట్లో ఉన్న పురుగుల మందును బోయ రమేష్ తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి మృతి చెందాడు. మృతుడి సోదరి చిలకలడోణ గ్రామానికి చెందిన బోయ తాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మాధవరం ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. గురువారం పోస్టుమార్టం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కాగా మృతుడు రమేష్‌కు భార్య రంగమ్మ, ఒక కుమారుడు సంతానం.

యువకుడి ఆత్మహత్య



అనిల్ (ఫైల్)

ఓర్వకల్లు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన బోయ అనిల్ (22) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. అనిల్ తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. అనిల్ కుమార్‌కు ఏడాది క్రితం వివాహమైంది. అయితే భార్య కాపురానికి రావడం లేదన్న మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు యువకుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

కర్నూలు క్రైం/వెల్దుర్తి, వెల్దుర్తి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు అందించే ఎరువులు, డీఏపీ, యూరియా మందులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని విజిలెన్స్ సీఐ పవన్ కిషోర్ హెచ్చరించారు. గురువారం విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి ఆదేశాల మేరకు జిల్లాలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. విజిలెన్స్ సీఐ కిషోర్, మండల విజిలెన్స్ వ్యవసాయాధికారి ఎస్.విశ్వనాథ్, వెల్దుర్తి ఏవో ఆర్.అక్బర్ బాషా ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. వెల్దుర్తి మండలంలోని శ్రీ సాయికృష్ణ ఫర్టిలైజర్స్ శ్రీనివాస ఆగ్రో ఏజెన్సీస్, రేణుకా మాత ఆగ్రో ఏజెన్సీస్, వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ అలాగే కర్నూలులోని పలు దుకాణాలు, గోడౌన్‌లను తనిఖీ చేశారు. యూరియా, డీఏపీ ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినందున రూ..3,74,407 విలువ గల 390 బస్తాల ఎరువులు అమ్మకాల నిలుపుదల చేశారు.

పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచింది

- 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



టీడీపీ కార్యాలయం వద్ద నాయకుల సంబరాలు

కర్నూలు అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థుల గెలుపుతో ప్రజాస్వామ్యం గెలిచిందని 'కుడా' చైర్మన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయం ఎదుట రాష్ట్ర ఎస్సీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆకెపోగు ప్రభాకర్, డీసీఎంహెచ్ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్, నాయకులు, కార్యకర్తలు బాణ సంచాలపేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ పులివెందుల గడ్డలో వైసీపీ అభ్యర్థికి డిపాజిట్ కూడా రాకుండా ప్రజలు ఓడించారన్నారు. గత 3 దశాబ్దాలుగా ఓటు వేయని ప్రజలు తమకు ఓటు వేసేందుకు అవకాశం కల్పించాలని కోరారని, పులివెందుల ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పించారని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేషన్ల డైరెక్టర్లు థరూర్ జేమ్స్, పాలక వీటి విజయకుమార్, సత్రం రామకృష్ణ, ఆర్.బాబురావు, గున్నామార్క్, పేరపోగు చిన్న మారెన్న తదితరులు పాల్గొన్నారు.

వీడిన మహిళ మిస్సింగ్ మిస్టరీ

- బ్యాంకు మేనేజరే సూత్రధారి..
- మహిళను తీసుకువచ్చి తహసీల్దార్ ఎదుట హాజరుపరచిన పోలీసులు

ఆలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలగవల్లి గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యం కేసు మిస్టరీ వీడింది. పలీసుల కథనం మేరకు.. గత నెల 8న అదృశ్యమైనట్లు బంధువులు ఆలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేశారు. 35 రోజులు గడిచినా ఆచూకీ లభించలేదు. స్టేట్ బ్యాంక్‌లో మేనేజర్‌పై బంధువులు అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు స్టేషన్‌కు పిలిపించి విచారణ చేయగా, తనకు తెలియదంటూ మేనేజర్ సమాధానమిచ్చాడు. చివరకు బుధవారం బ్యాంకు మేనేజర్‌తో కలిసి దిగిన ఫొటోలు వాట్సాప్ గ్రూపులో వైరల్ కావడంతో పోలీసులు విచారణ చేయగా కర్ణాటకలోని తోరణగల్‌లో ఓ ఇంట్లో ఉన్నట్లు తెలుసుకుని పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య ఆదేశాల మేరకు ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్ఐ మహబూబ్ బాషా ఆమెను ఆలూరుకు తీసుకొచ్చారు. తహసీల్దార్ శోభా సువర్ణమ్మ ఎదుట హాజరుపరచగా తాను ఇష్టపూర్వకంగానే వెళ్లానని మహిళ స్టేట్‌మెంట్ ఇవ్వడంతో పోలీసులు ఆమె అంగీకారం మేరకు భర్తకు అప్పగించారు.

కిడ్నాప్ కేసులో ఐదుగురు అరెస్ట్

మండలంలోని మొలగవల్లి స్టేట్ బ్యాంక్ మేనేజర్ హరిప్రసాద్‌ను కిడ్నాప్ చేసి దాడి చేసిన కేసులో ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం నిందితులు జీవన్‌కుమార్, బసవరాజు, దస్తగిరి, రామాంజనేయులు, రాజ్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఇది ప్రజాస్వామ్య విజయమే

- జగన్ మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుంది
- రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లె, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడం ప్రజాస్వామ్య విజయమేనని రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్యం గెలిచిన రోజు అని అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో 14నెలల కూటమి ప్రభుత్వం సంక్షేమ సుపరిపాలన అభివృద్ధిపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పులివెందులలో నియంతృత్వ ఏకగ్రీవాలకు చరమగీతం పాడినరోజే టీడీపీ మానసికంగా గెలి చిందన్నారు. నేడు జగన్ సీఎం చంద్రబాబు వయస్సు, పాప పుణ్యాలు మాట్లాతుంటే దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉందన్నారు. జగన్ ప్రజాస్వామ్యం, ఎన్నికల్లో అరాచకం అంటూ మాట్లాడుతుంటే చిన్నపిల్లలు సైతం నవ్వుకుంటున్నారన్నారు. నియంతృత్వ ఏకగ్రీవాల నుంచి బయటపడి పులివెందుల ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్న రోజే టీడీపీ విజయం ఖరారైందన్నారు. ఇప్పటికైనా వైసీపీ, జగన్ కళ్లు తెరిచి ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవాలన్నారు. జగన్ లాంటి అప్రజాస్వామ్య వాదులు అరాచక శక్తులకు టీడీపీ విజయం చెంపపెట్టులాంటి దన్నారు. భవిష్యత్‌లో వైసీపీని ప్రజలు ప్రతి ఎన్నికల్లోనూ ఓటు ద్వారా బుద్ధిచెబుతారన్నారు.

నేలకొరిగిన మావోయిస్టు సభ్యుడు నాగన్న

- చత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్‌లో హతం
- 22ఏళ్ల వయస్సులోనే ఉద్యమ బాటలోకి
- ఆయన స్వగ్రామం వడ్లరామాపురం



వడ్లరామాపురం ఏరియల్ వ్యూ, ఇన్‌సెట్‌లో నాగన్న(ఫైల్)

ఆత్మకూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు మావోయిస్టుల కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్న నల్లమల ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఈ ప్రాంతం నుంచి మావోయిస్టు ఉద్యమంలోకి అడుగిడిన సుగులూరి చిన్నన్న అలియాస్ విజయ్ అలియాస్ సుగులూరు నాగన్న (57) చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని చౌకీ జిల్లాలో గల రాజ్‌నంద్ గావ్ - కాంగేర్ సరిహద్దులో బుధవారం జరిగిన పోలీసుల ఎన్‌కౌంటర్‌లో నేలకొరిగారు. నల్లమల కేంద్రంగా సాగిన అనేక దళాల్లో ఆయన చురుకైన పాత్ర పోషించారు. సుమారు మూడున్నర దశాబ్దాల పాటు ఉద్యమంలో కీలక వ్యవహరిస్తూ వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన ప్రస్తుతం దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. అక్కడి దండకారణ్యంలో మావోయిస్టులకు, పోలీసుల జరిగిన పరస్పర కాల్పుల నేపథ్యంలో ఎన్‌కౌంటర్‌లో ఆయన హతమయ్యారు.

విప్లవ సాహిత్యానికి ఆకర్షితులై...

ఆత్మకూరు మండలం వడ్లరామాపురం గ్రామానికి చెందిన సుగులూరి దానమయ్య, దానమ్మ దంపతుల కుమారుడైన చిన్నన్న మావోయిస్టు పార్టీ వైపు అడుగులు వేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దానమయ్య దంపతులకు మొత్తం నలుగురు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నాయి. వీరిలో రెండో కుమారుడైన చిన్నన్న ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే 10వ తరగతి వరకు విద్యనభ్యసించారు. ఆతర్వాత గ్రామంలోనే పట్టుపురుగుల బుట్టలు, తడికలు అల్లుకుని జీవనం సాగించేవారు. ఆసమయంలోనే సాధారణ గ్రామ రైతు కూలీ సంఘం సభ్యుడిగా కొనసాగారు. ఈ క్రమంలోనే 1988లో కొత్తపల్లి మండలంలోని దుద్యాల గ్రామానికి చెందిన సరోజమ్మను వివాహం చేసుకున్నారు. ఈయనకు క్రాంతికుమార్, రామకృష్ణ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే ఆ సమయంలో తరుచూ అటవీశాఖ అధికారులు దళితులను చిత్రహింసలకు గురిచేయడం, తప్పుడు కేసులు బనాయించడం కారణాలతో మావోయిజం వైపు అడుగులు వేయాలని నిర్ణయించుకున్నారు. ఆ సందర్భంలోనే నల్లమలను కేంద్రంగా చేసుకుని అటవీ సమీప గ్రామాల్లో మావోయిస్టులు కార్యకలాపాలు కొనసాగించేవారు. ఈ క్రమంలో వడ్లరామాపురం గ్రామానికి రాత్రివేళల్లో నక్సల్స్ చేరుకుని విప్లవ సాహిత్యంతో యువతను ఆకర్షించేవారు. ఇందులో భాగంగానే 22ఏళ్ల చిరుప్రాయంలోనే ఆయన మావోయిస్టు ఉద్యమంలోకి వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఇటీవల వడ్లరామాపురంలో పర్యటించిన చత్తీస్‌ఘడ్ బలగాలు

దేశంలో మావోయిస్టు ఏరివేతపై కేంద్ర హోంశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఈ ఏడాది మే 10,11,12 ఆపరేషన్ కగార్ పేరుతో తేదీల్లో చత్తీస్‌ఘడ్‌లోని అబూజ్‌మడ్ అడవుల్లో పోలీసులు కాల్పులు చేపట్టారు. ఈ ఘటనలో ఎవరూ ఊహించని విధంగా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. ఈ ఘటనలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆస్పరి మండలం ములుగుగుంద గ్రామానికి చెందిన సంగీత అలియాస్ లలిత అనే మహిళా మావోయిస్టు మరణించారు. ఆ సమయంలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా ఉన్న సుగులూరు చిన్నన్న ఆ ఘటనలో తప్పించుకున్నట్లు తెలిసింది. దీంతో ఆయన గురించి చత్తీస్‌ఘడ్ పోలీసులు మే 13న ఆత్మకూరు మండలంలోని వడ్లరామాపురం గ్రామానికి చేరుకుని వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి పూర్వ వివరాలు సేకరించారు. ఈ క్రమంలోనే ఆయనను పట్టిస్తే రూ.25 లక్షల రివార్డును కూడా చత్తీస్‌ఘడ్ పోలీసులు ప్రకటించారు. మొత్తానికి సుగులూరు చిన్నన్న బ్రతికే ఉన్నాడని తెలియడంతో కుటుంబ సభ్యుల్లో ఆనందం నెలకొంది. అయితే సరిగ్గా మూడు నెలల్లోపే ఎన్‌కౌంటర్‌లో మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రస్తుతం చిన్నన్న భార్య, కొడుకులు కొత్తపల్లి మండలంలోని దుద్యాల గ్రామంలో నివాసం ఉండగా, ఆయన సోదరులు రాజగోపాల్, రవిచంద్రబాబు, భూపాల్‌లు వడ్లరామాపురం గ్రామంలోనే ఉంటున్నారు. 20ఏళ్ల క్రితం చర్చల సమయంలో ఒకసారి మాత్రమే ఆయన కుటుంబ సభ్యులతో కలిసినట్లు తెలిసింది. అప్పటి నుంచి నేటి వరకు ఆచూకీ లేదని కుటుంబసభ్యులు చెబుతున్నారు.

మృతదేహం కోసం కుటుంబ సభ్యుల ప్రయత్నం

చత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు సుగులూరి చిన్నన్న మృతదేహం కోసం ఆయన కుమారులు క్రాంతికుమార్, రామకృష్ణలు నంద్యాల జిల్లా ఎస్పీ ఆధిరాజ్‌సింగ్ రాణాను సంప్రదించినట్లు తెలిసింది. వారి వివరాలను సమర్పించి చత్తీస్‌ఘడ్‌కు వెళ్లి తండ్రి మృతదేహాన్ని స్వగ్రామమైన వడ్లరామాపురానికి తీసుకురావాలని వారు ప్రయత్నిస్తున్నారు. అయితే ప్రస్తుతం వడ్లరామాపురం గ్రామానికి వెళ్లే రహదారిపై భవనాశి ఉధృతంగా ప్రవహించడంతో వారి సోదరులు గ్రామం నుంచి బయటకు రాలేకపోతున్నారు. వారు కూడా చిన్నన్న మృతదేహం కోసం ఎదురుచూస్తున్నారు.

కాలనీ.. కహానీ

నిరుపేదలకు పక్కా గృహం నిర్మించేందుకు గత వైసీపీ హయాంలో 'జగనన్న కాలనీ' పేరిట గృహాలను నిర్మించారు. అయితే వీటిని పూర్తిచేయకపోవడం, కాలనీలో రోడ్లు, తాగునీరు తదితర సౌకర్యాలు లేకపోవటంతో గృహాల్లో చేరేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో గృహాలు అప్పుడే శిథిలావస్థకు చేరాయి.


ఇళ్లమధ్య నిలిచిన వర్షపు నీరు

- నివాస యోగ్యం కాని జగనన్న కాలనీ
- అధ్వానంగా రహదారులు, కాలనీలో వర్షపు నీరు
- తాగునీటి సౌకర్యం లేక ఆసక్తి చూపని లబ్ధిదారులు

ఆదోని, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి 7 కి.మీ. దూరంలోని ఢణాపురం గ్రామ సమీపంలో గత వైసీపీ ప్రభుత్వం 'జగనన్న కాలనీ' ఏర్పాటు చేసింది. కాలనీలో మొత్తం 5,101 ఇళ్లు మంజూరు కాగా ఇంతవరకూ ఒక్క గృహం కూడా పూర్తికాలేదు. స్టీలు, సిమెంట్, ఇసుకను గృహ నిర్మాణశాఖ అందజేసింది. వీటిలో 3,097 గృహాల ఇంటి మొదటి భాగం ప్లాస్టరింగ్ చేసి రంగు వేశారు. ఇక మిగతా గృహాలు వివిధ స్థాయిలో ఆగిపోయాయి. వీటిలో 188కి పైగా కాంక్రీట్, 108 రూఫ్ లెవెల్, 28 ఇళ్లు లెంటల్ లెవెల్, 902 ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్, 28 ఇళ్లు లెంటల్ లెవెల్, 123 ఇళ్లు ప్లింత్‌బీమ్ లెవెల్, 188 ఇళ్లు బిలో బేస్‌మెంట్ లెవెల్‌లో నిలిచిపోయాయి. ఇంకా 427 ఇళ్ల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం లేదు.

ఇప్పటివరకు బిల్లులు మంజూరు

సెంటు స్థలం మాత్రమే ఇవ్వడంతో లబ్ధిదారులు అంతగా ఆసక్తి చూపలేదు. దీంతో తామే ఇళ్లు కట్టించి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించి, కాంట్రాక్టను నెల్లూరు చెందిన జేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ జనార్దన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డికి అప్పగించింది. ఒక్కో గృహానికి రూ.1.80 లక్షలు మంజూరుచేసి, పొదుపు మహిళలు రూ.30 వేల రుణం తీసుకునే అవకాశం కల్పించింది. అయితే పొదుపు మహిళలు ముందుకు రాకపోవడంతో చేసేదేమీ లేక జగనన్న ఇంటికి ముఖ ద్వారం గోడకు మాత్రమే సిమెంట్‌తో ప్లాస్టింగ్ చేసి తెలుపురంగు వేసి లబ్ధిదారులకు అప్పగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

కనీస సదుపాయాలు కరువు

కాలనీకి వెళ్లేందుకు రహదారి కూడా సరిగా లేదు. వర్షం దెబ్బకు కోతకు గురై నడిచేందుకు కూడా వీలు కావడం లేదు. బురద ఉండటంతో కాలనీలో అడుగు తీసి అడుగు పెట్టాలంటే కూడా భయపడుతున్నారు. అలాగే తాగునీటి సదుపాయం లేదు. ప్రభుత్వం మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

నాసిరకం పనులు

కాంట్రాక్టర్ నాసిరకం మెటీరియల్ వాడటంతో గృహాలు అప్పుడే శిథిలావస్థకు చేరాయి. నాణ్యమైన కాంక్రీటును ఉపయోగించకుండా నిర్మించడంతో గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. కొన్ని గృహాలను పునాదులు, పిల్లర్లు లేకుండానే నిర్మించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో వీటిలో చేరేందుకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు.


కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి ఇదే


బురదమయంగా కాలనీలోని రహదారి

అదనపు ఖర్చులు లబ్ధిదారులే భరించాలి

జగనన్న ఇళ్లు ముందు వైపు మాత్రమే కాంట్రాక్టర్ పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పజెబుతారు.విద్యుత్ వైరింగ్, మిగతా ఖర్చులు లబ్ధిదారులే భరించాల్సి ఉంటుంది. ఇందుకు ప్రభుత్వం ఒక్కొక్క లబ్ధిదారుడికి ఎస్టీ అయితే రూ.75 వేలు, ఎస్సీ, బీసీ అయితే రూ.50వేలు ఇస్తుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక 350 మంది లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్‌లో నగదు జమ అయ్యింది. మిగతా వారికి కూడా త్వరలో జమ జమవుతుంది. కాలనీలో రహదారులను నిర్మిస్తాం.

- చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గృహనిర్మాణ శాఖ, ఆదోని.

ఎరువులను అందుబాటులో ఉంచాలి

మద్దికెర, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దుకాణాల యజమానులు రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాలని ఏవో రవి సూచించారు. గురువారం మండల కేంద్రంలో దుకాణాలను తనిఖీ చేశారు. వర్షాలు కురుస్తుండటంతో ఎరువులు ఎక్కువగా అవసరమని కొనుగోలు చేసిన రైతులకు రసీదులు ఇవ్వాలన్నారు. ఎరువులు, క్రిమి సంహారక మందుల ధరలను పట్టికలో ఉంచాలన్నారు. రైతులు ఇష్టానుసారం మందులు వాడరాదని, వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. డీలర్లు నాగభూషణం చౌదరి, భీమలింగ ఉన్నారు.

వాగులో కంప తొలగింపు

హాలహర్వి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి నిట్రవట్టి గ్రామాల వాగు వంతెనపై కంప ను గురువారం ఎంపీడీవో వరలక్ష్మి తొలగింజేశారు. ఎక్స్‌కవేటర్ సాయంతో కంపను తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. ఈ వంతెన మీదుగా విరుపాపురం, బలగోట, కుర్లేహళ్లి, సుకువాయి గ్రామాలకు ప్రయాణికులు రాకపోకలకు కొనసాగిస్తారు. వర్షాల ప్రభావంతో ప్రమాదాలు జరగ కుండా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.


పనులను పరిశీలిస్తున్న అధికారులు

కాలువ ఏర్పాటు చేయాలి


గుండ్లకొండ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

దేవనకొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువకు స్లూయిజ్ ఏర్పాటు చేసి, పి.కోటకొండకు కాలువ ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకుడు వీరశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గుండ్లకొండ ప్రధాన కాలువను పరిశీలించారు. స్లూయిజ్ ఏర్పాటు చేస్తే పది గ్రామాలకు సాగు,తాగునీటి సమస్య ఉండదన్నారు. పాణ్యం, పత్తికొండ నియోజకర్గంలో స్లూయిజ్‌ల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చిన ప్రభుత్వం దేవనకొండపై సవతితల్లి ప్రేమ చూపడం తగదన్నారు. ఆశోక్, యూసుఫ్ బాషా, సూరి, తదితరులు పాల్గొన్నారు.

ఆదుకోవాలని సీఎంకు విజ్ఞప్తి

ఆలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి గుండెపోటుతో మృతిచెందిన తన సోదరుడు సురేంద్ర కుటుంబాన్ని ఆదుకోవాలని టీడీపీ నాయకులు గోపాల్ సీఎంను కోరారు. గురువారం మంగళగిరి కేంద్ర కార్యాలయంలో చంద్రబాబును కలిసి విన్నవించారు. మూడు నెలలు గడిచినా సాయం అందలేదన్నారు. స్పందించిన సీఎం త్వరలో సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు గోపాల్ తెలిపారు.


సీఎం చంద్రబాబుతో గోపాల్

కమ్యూనిటీ హాల్ నిర్మించాలి

ఆదోని రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతేకుడ్లూరు గ్రామంలో దళితుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కేవీపీఎస్ మండల కార్యదర్శి తిక్కప్ప డిమాండ్ చేశారు. గురువారం మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ నిధులున్నా ఉపయోగించడం లేదన్నారు.

సంప్రదాయ బద్ధంగా ఉత్సవాలు

ఆదోని టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : గణేష్ ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా చేసుకోవాలని ఉత్సవ సమితి సభ్యులు పిలుపు ఇచ్చారు. గురువారం ధ్వజారోహణ నిర్వహించారు. మంటపాల ఏర్పాటుకు వీహెచ్‌పీ కార్యాలయంలో దరఖాస్తు ఇవ్వాలని కోరారు. కునిగిరి నీలకంఠ, దేవిశెట్టి ప్రకాష్, మారుతి రావు ఉన్నారు.

స్వచ్ఛ పత్తికొండ అందరి బాధ్యత

పత్తికొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ పత్తికొండ అందరి బాధ్యత లని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం పట్టణంలోని కర్నూలు రహదారి పక్కన గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పూలమొక్కలను నాటారు. మన ఇంటిని ఎలా ఉంచుకుంటామో పట్టణాన్ని కూడా శుభ్రంగా ఉంచుకోవాని సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో నరసింహులు, సాంబశివారెడ్డి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, రామానాయుడు, లోక్‌నాథ్ తదితరులు ఉన్నారు.


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

నేటి నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం

తుగ్గలి: శుక్రవారం నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తున్నట్లు పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. గురువారం పెండేకల్లులో మాట్లాడుతూ పులివెందులలో ప్రజాతీర్పు వెలువడిందని, వైసీపీకి డిపాజిట్లు కూడా దక్కలేదన్నారు. ప్రజలకు సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు చేయడమే సీఎం చంద్రబాబు ధ్యేయమన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ సర్పంచ్, బర్మా వీరేష్, రోలప్ప పాల్గొన్నారు.

రేపు ట్రాక్టర్ ర్యాలీ

ఆలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): 'అన్నదాత సుఖీభవ' అములుపై హర్షం వ్యక్తం చేస్తూ ఈనెల 16న పట్టణంలో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ గురువారం తెలిపారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆర్టీసీ చైర్మన్ పూల నాగరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, కప్పట్రాళ్ల బొజ్జమ్మ పాల్గొంటారని కూటమి నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

బాల్య వివాహాలను ఎదిరించండి


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ హేమలత

ఆదోని రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాల్య వివాహాలను ఎదిరించాలని డీఎస్పీ హేమలత సూచించారు. గురువారం పెద్దతుంబళం జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మారుతిప్రియ ఆధ్వర్యంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ప్రేమలో పడవద్దని, పగ చూపవద్దని చెడు అలవాట్లకు బానిస కావొద్దన్నారు. బుద్ధిగా ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలని డీఎస్పీ కోరారు. హెచ్ఎం సీఐ నల్లప్ప, ఎస్ఐ మహేష్ కుమార్ ఉన్నారు.

టీడీపీ విజయం వైసీపీకి చెంప పెట్టు

ఆదోని, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి లతారెడ్డి, ఒంటిమిట్టలో ముద్దు కృష్ణారెడ్డి ఘన విజయం సాధించడం వైసీపీకి చెంపపెట్టని కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప అన్నారు. గురువారం మాట్లాడుతూ 40 ఏళ్లగా ఎన్నికలు జరపకుండా ఏకగ్రీవంగా గెలుస్తున్నపార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారన్నారు.


మాట్లాడుతున్నమాన్వి దేవేంద్రప్ప

ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ గుండాల్ నాయక్ సూచించారు. గురువారం మద్దికెర గ్రామ శివారులోని హంద్రీనీవా కాలువను పరిశీలించారు వీఆర్వోలు గ్రామాల్లో పర్యటించి కూలేందుకు సిద్ధంగా ఉన్న గృహాల్లోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఆర్ఐ రామదాసు, వీఆర్వోలు రంగస్వామి, రషీద్, సర్వేయర్ నరేంద్ర తదితరులు ఉన్నారు.

రేపు యూపీఎస్ఎఫ్ సమావేశం

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16న కర్నూలులో అన్ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు నాయకులు దుర్గేష్, కూనల్, గుడిసె రామకృష్ణ తెలిపారు. గురువారం మాట్లాడుతూ అన్ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ ఎదుర్కొంటున్న సమస్యలుపై చర్చిస్తామన్నారు. ఆర్‌టీఈ ప్రవేశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. కార్యక్రమానికి మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్, డీఈవో శామ్యూల్ పాల్, వ్యవస్థాపక అధ్యక్షులు ప్రవీణ్ వస్త్రారని, పాఠశాలల యాజమాన్యాలు విజయవంతం చేయాలని కోరారు.

మున్సిపల్ సిబ్బంది 'తిరంగా' ర్యాలీ

ఆదోని టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మున్సిపల్ సిబ్బంది గురువారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు కమిషనర్ కృష్ణ ఆధ్వర్యంలో పజల్లో స్వాతంత్ర స్ఫూర్తిని కలిగిస్తూ, సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ సాగారు.

ప్రజాస్వామ్యానిదే విజయం


- టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర



తుగ్గలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో ప్రజాస్వామ్యానిదే విజయమని, జగన్ అడ్డాగా చెప్పుకునే వైసీపీకి డిపాజిట్లు కూడా దక్కలేదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. గురువారం మాట్లాడుతూ పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో గెలుపొందిన టీడీపీ అభ్యర్థులు మారెడ్డి లలితారెడ్డి, ముద్దుకృష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో అప్రజాస్వామికంగా ఎన్నికలు నిర్వహించేవారనీ, కానీ నేడు ఓటర్లు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. ఇకనైనా ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని, అభివృద్ధి పథంతో ముందుకు వెళ్తున్న కూటమి ప్రభుత్వం వైపు కన్నెత్తి కూడా చూడకూడదని నాగేంద్ర సూచించారు.

చరిత్ర తిరగరాసిన టీడీపీ

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు



ఆదోని, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జగన్ అడ్డా పులివెందులో టీడీపీ చరిత్రను తిరగరాసిందని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు అన్నారు. గురువారం మాట్లాడుతూ జగన్ అరాచక పాలన భయంతో ఓటు వేయలేని పులివెందుల ప్రజలు జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు వేసి తీర్పు చెప్పారన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం తమదేనన్న జగన్‌పై ప్రజలు గర్జించారన్నారు. పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచిందని, జగన్ రాజకీయం ముగిసిందన్నారు. ఇకమీదైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, ఇప్పటికే ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో 11 సీట్లు ఇచ్చి బుద్ధి చెప్పారన్నారు.

కార్మికుడి ఇంట్లో చోరీ

ఆలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పారిశుధ్య కార్మికుడు నరసప్ప ఇంట్లో గురువారం మధ్యాహ్నం చోరీ జరిగింది. బాధితుడు, పోలీసులు తెలిపిన మేరకు.. గాంధీనగర్‌లో నివాసముంటున్న నరసప్ప కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి పెళ్లికి వెళ్లారు. దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న రూ.30 వేలు నగదు, జత బంగారు కమ్మలు అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఇంటిని పరిశీలించారు. కేసు విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ మహబూబ్ బాషా తెలిపారు.

మోదీ గుప్పిట్లో ఎన్నికల కమిషన్

- పీ-4తో పేదరిక నిర్మూలన అసాధ్యం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పత్తికొండ టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ గుప్పిట్లో ఎన్నికల కమిషన్ ఉందని, దీంతో దేశంలో ప్రజాస్వామ్యానికే ప్రమాదం ఏర్పడిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. గురువారం పత్తికొండకు వచ్చిన ఆయన సీపీఐ కార్యాలయంలో మాట్లాడారు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బీహార్ ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ఓట్లు వేస్తారని గుర్తించిన మోదీ ఈసీతో కుమ్మక్కై 60 లక్షల ఓట్లు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఆధారాలతో సహా బయటపెట్టినా ఈసీ చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. ఇందుకు నిదర్శనం బెంగళూరులోని ఓ పార్లమెంట్ సెగ్మెంట్‌లో ఆరు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థికి మెజార్టీ వస్తే ఒక సెగ్మెంట్‌లో మాత్రం లక్ష పై చిలుకు దొంగ ఓట్లతో బీజేపీ అభ్యర్థి గెలిచారన్నారు. ఇంత జరుగుతున్నా సీఎం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, ప్రతిపక్షనాయకుడు జగన్ నోరు మెదపడం లేదన్నారు. పీ-4తో పేదరిక నిర్మూలన అసాధ్యమన్నారు. రామచంద్రయ్య, గిడ్డయ్య, రాజాసాహెబ్ ఉన్నారు.

బిల్లులు చెల్లించాలి

- కాంట్రాక్టర్ల ఆవేదన


మాట్లాడుతున్న కాంట్రాక్టర్లు

హొళగుంద, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ హయంలో నిర్మించిన సిమెంట్ రోడ్ల పనులకు ఇంతవరకు బిల్లులు చెల్లించ లేదని వెంటనే చెల్లించాలని కాంట్రాక్టర్లు దుర్గయ్య, పొంపాపతి, జాకీర్, మెయిన్, పీరన్న కోరారు. గురువారం మాట్లాడుతూ 2018 14వ ఆర్థిక సంఘం సాధారణ నిధులతో హొళగుంద మండలంలో వడ్డీలకు తెచ్చి రూ.2 కోట్లతో పనులు చేశామని, ఎన్నికలు రానున్నాయని అధికారులు పనులను ఆఘమేగాలపై పూర్తి చేయించారన్నారు. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో వడ్డీలు కట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి టీడీపీ ప్రభుత్వం వచ్చిందని ఇప్పటికైనా తమకు బిల్లులు చెల్లించాలని కోరారు.

రావి ఆకుపై దేశ చిత్రపటం



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి భరత్ కుమార్ రావి ఆకుపై భారత దేశ చిత్రపటం, మూడు రంగుల జాతీయ జెండా ఆకృతిని తయారు చేసి అబ్బురపరిచాడు. తర్ఫీదు ఇచ్చిన డ్రాయింగ్ ఉపాధ్యాయుడు కీరాను, విద్యార్థి భరత్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫయాజుద్దీన్ అభినందించారు. - ఆదోని అగ్రికల్చర్, ఆంధ్రజ్యోతి



ఉచిత వైద్య శిబిరం

పత్తికొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హోసూరు గ్రామంలో వాకిటి శ్రీనివాసులు వర్ధంతి సందర్భంగా గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కర్నూలు అమీలియో ఆసుపత్రి వైద్యులు పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. జగ్గిలి అంజనేయులు, వాకిటి రాహుల్, సాయినాథ్‌రెడ్డి, రామవేంద్ర ఉన్నారు.

- వాకిటి శ్రీనివాసులుకు పత్తికొండ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్యాంబాబు నివాళి అర్పించారు.

సారా తయారుచేస్తే కఠిన చర్యలు

పత్తికొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సారా తయారు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎక్సైజ్ సీఐ సువర్ణలత హెచ్చరించారు. గురు వారం మండలంలోని జెఎం తండాలో అవగాహన కల్పించారు.

1,450లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

తుగ్గలి, పత్తికొండ మండలాల పరిధిలోని రోళ్లపాడు తండా, లక్ష్మీతండా, జెఎం తండా, పిఎం తండాల్లో దాడులు చేసి 1,450లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

ముప్వైన్నల జెండాతో ర్యాలీ

ఆస్పరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు, మండల అధికారులు గురువారం జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో గీతావాణి ముందుండి 79 మీటర్ల జాతీయ పతాకాన్ని చేత పట్టుకుని నడిచారు.

గ్రామాభివృద్ధికి కలెక్టర్ కృషి

తుగ్గలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కలెక్టర్ రంజిత్ బాషా కృషి చేశారని ట్రైబల్ వెల్ఫేర్ సలహా మండలి సభ్యుడు వెంకటపతి అన్నారు. గురువారం కర్నూలులో కలెక్టర్‌ను చెన్నంపల్లి సర్పంచ్ రంగమ్మ, చెన్నంపల్లి సర్పంచ్ మస్తాన్‌బీతో కలిసి సన్మానించారు. చెన్నంపల్లి గ్రామ పంచాయతీకి రూ.కోటి నిధులు మంజూరు చేయాలని, కడమకుంట్ల పంచాయతీలోని హుశేనాపురం, రోళ్లపాడు తండాలో సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు.


కలెక్టర్‌ను సన్మానిస్తున్న వెంకటపతి

అన్నదాతకు ప్రభుత్వం అండ: ఎమ్మెల్యే



ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి



ఎమ్మెల్యే బీవీని గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ కింద రైతు ఖాతాల్లో రూ. 7వేలు జమ చేయటంతో ఎమ్మిగనూరులో ఎమ్మెల్యే బీవీ ఆదర్యంలో గురువారం రైతు సంబరసభను నిర్వహించారు. ఇందులో భాగంగా నందవరం మండలం ముగతి గ్రామం నుంచి దాదాపు 150 ట్రాక్టర్లతో ఎమ్మిగనూరు పట్టణానికి ర్యాలీ నిర్వహించారు. ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే బీవీ స్వయంగా నడుపుతూ రైతుల్లో ఉత్సాహాన్ని నింపారు. ర్యాలీలో బీజేపీ, జనసేన నాయకులు నరసింహులు, ఈరన్న, రేఖాగౌడ్, రవిలు పాల్గొన్నారు. ర్యాలీ మార్కెట్ సర్కిల్, ఓం శాంతి సర్కిల్, పార్కురోడ్డు, వైఎస్ఆర్ సర్కిల్ మీదుగా సోమప్ప సర్కిల్ వరకు సాగింది. సోమప్ప సర్కిల్‌లో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌ల చిత్రపటాలకు గోదుమలతో ధాన్యాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో పుష్కలంగా వర్షాలు కురుసి ప్రాజెక్టులు, చెరువులు నిండాయన్నారు. దీంతో రైతులు వివిద రకాల పంటలను ఎంతో ఆనందంగా సాగుచేసుకుంటున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వర్షాలపై కూడా రాజకీయాలు మాట్లాడుతూ ఆపార్టీ నాయకులు విషం చిమ్మారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో నిలిపివేసిన సాగునీటి, తాగునీటి ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వం తిరిగి మంత్రిమండలిలో ఆమోదం తెలిపి ప్రాజక్టులు నిర్మాణాలను జరిగేందుకు చర్యలు తీసుకుందన్నారు. హంద్రినీవానుంచి జీడీపీకి నీటిని మళ్లించి సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుందన్నారు. రైతుసంక్షేమంతో పాటు చేనేతలతో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పాటు పడుతోందన్నారు. పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని గెలిపించుకున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, మాజీ జడ్పీవైస్ చైర్మన్ పుష్పావతి, మాజీ జడ్పీటీసీ ఈరన్న గౌడ్, మాజీ ఎంపీపీ శంకరయ్య, నాయకులు కాశీం వలి, కమ్మ మహేంద్ర బాబు, వెంకటేష్, రామదాసు గౌడ్, గోపాల్, మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన 30 కుటుంబాలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వగరూరు గ్రామంలోని కురువ సామాజిక వర్గానికి చెందిన 30 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. మండలంలోని మాధవరం గ్రామంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి నివాసంలో పుల్లన్న, గోవిందు, నర్సన్న, చంద్రప్ప, దస్తగిరి, నాగరాజు, బోడిలింగడు, శివన్న, వీరనాగుడు, మరో కొంతమంది వైసీపీ నుంచి టీడీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం చూసి టీడీపీలోకి చేరుతున్నట్లు తెలిపారు. వీరిని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి రాఘవేంద్రరెడ్డి, సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి, మంచాల సొసైటీ చైర్మెన్ రామకృష్ణరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గోపాల్, మల్లేష్, గుర్మింటి భీమిరెడ్డి, నాగరాజు, బూదిరెడ్డి, రామయ్య, జయరాం, కేశన్న, బొజ్జప్ప పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి కృషి



సూగూరు ముస్లింలకు ఉత్తర్వుల కాపీని ఇస్తున్న టీడీపీ నాయకులు

మంత్రాలయం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి సోదరులు, సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, మంచాల సింగిల్ విండో అధ్యక్షులు రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన మత పెద్దలు, వక్ఫ్‌బోర్డు భూములు, మసీదు నిర్మాణం, ఈద్గా అభివృద్ధి వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డిలకు ముస్లిం మత పెద్దలు శాలువలు, పూలమాలలు వేసి సత్కరించారు. వారు మాట్లాడుతూ ముస్లింలకు టీడీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, ఏ సమస్య వచ్చినా పరిష్కరించి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్, రజాక్, ఇబ్రహీం, బాషా, అబ్దులా పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం సమీపంలో ఓ కారు రోడ్డు పక్కలో ఉన్న చిన్నపాటి కాలువలోకి దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఆదోని వైపు నుంచి ఎమ్మిగనూరు వైపు వస్తున్న కారు సమీపంలోకి ఆదోనివైపు నుంచి వస్తున్న ఓ స్కూటి అతి సమీపానికి రావడంతో కారు డ్రైవర్ స్కూటర్‌ను తప్పించబోయి రోడ్డు పక్కలో ఉన్న చిన్నపాటి కాలులోకి దూసుకెళ్లాడు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. కారు ముందు భాగం మాత్రమే దెబ్బతింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఉరుకుందకు పోటెత్తిన భక్తులు



వెండి అలంకరణలో స్వామివారి మూలవిరాట్

కౌతాళం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణ మాసపు ఉత్సవాలలో భాగంగా మూడో గురువారం రోజున స్వామి దర్శనానికి భక్తులు వేలాదిగా తరలి రావడంతో ఆలయ క్షేత్రం భక్తుల రద్దీతో కొనసాగినది. మూడో గురువారం రోజున భక్తులు స్వామి దర్శనానికి వేలాది సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌ను వెండి అలంకరణ చేపట్టి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం నుంచి స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య అంతకంతకు పెరిగిపోవడంతో ఆలయంలోని క్యూలైన్లు నిండిపోయి గంటల తరబడి దర్శనానికి సమయం పటింది. దర్శనానికి మన రాష్ట్రం నుంచే కాక కర్ణాటక, తెలంగాణ నుంచి భక్తులకు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసినది.

స్వామి సన్నిధిలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు: ఉరుకుంద ఈరన్న స్వామి వారిని గురువారం ఎమ్మెల్సీ బీటీ నాయుడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ముందుగా ఆలయ ఈఓ వాణి ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి పూలమాల, స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం స్వామి శ్రావణ మాసపు ఏర్పాట్లపై ఆలయ ఈఓ వాణితో అడిగి తెలుసుకున్నారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా మెరుగైన సౌకర్యాలు అందించాలని తెలిపారు

విరాళాలు అందజేత: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న జీర్ణోద్ధారణ పనులకు తెలంగాణ జోగులాంబ గద్వాల్ జిల్లా ఐజ వాస్తవ్యులు డాక్టర్ విశోక్ కుటుంబ సభ్యులు రూ.1,00,000ల నగదును, కర్నూలు జిల్లా ఆలూరు వాస్తవ్యులు చాకలి మల్లేశ్వరమ్మగారి కుటుంబ సభ్యులు రూ.55,000లు అందజేసినట్లు తెలిపారు.

నిందితుడి అరెస్టు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసముంటున్న ధనుంజయుడు అనే వృద్ధుడికి కేర్ టేకర్‌గా వ్యవహరిస్తూ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన నిమ్మగంటి చరణ్ సాయిను పట్టణ పోలీసులు అనంతపురంలో అరెస్ట్ చేశారు. అతడు నుంచి దొంగలించిన బంగారు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు గాంధీనగర్‌లోని ధనుంజయుడికి వయస్సు రీత్యా పనులు చేసుకోలేక కేర్ టేకర్‌గా నిమ్మగంటి చరణ్ సాయిని నియమించుకోగా తను కొన్ని రోజుల నమ్మకంగా పని చేసి జూలై 2వ తేదిన ఇంట్లో ఎవరు లేని సమయంలో భావించి నగలు దొంగలిచి పారిపోయాడని ఇంటి యజమాని ఫిర్యాదు చేయగా. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిమ్మగంటి చరణ్ సాయిని అనంతపురంలోని శ్రీనివాసనగర్ అన్నా క్యాంటిన్ దగ్గర అరెస్ట్ చేసి తన నుండి రూ.6,90,000 విలువ గల 88.5 గ్రాముల బంగారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన సీఐ శ్రీనివాసులు, ఎస్సై మధుసుధన్‌రెడ్డి, ఎస్సై శ్రీనివాసులు, పీసీ మద్దిలేటి, రఘు, హూస్సేన్‌లను ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రత్యేకంగా అభినందిచారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక మంత్రి

మంత్రాలయం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర వైద్యశాఖ మంత్రి శరణ్ ప్రకాశ్ పాటిల్, రాయచూర్ రూరల్ ఎమ్మెల్యే దద్దల బసన్న గౌడు, రాయచూరు ఎమ్మెల్సీ వసంతకుమార్, తెలంగాణ సీఎం రెవంత్‌రెడ్డి సోదరుడు జగదీశ్వర్ రెడ్డి గురువారం రాత్రి మంత్రాలయానికి వచ్చారు. వీరికి మహా ముఖద్వారం వద్ద మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, సురేష్‌కోణాపూర్, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తిలు ఘనంగా స్వాగతం పలికారు.

సొసైటీలతో రైతులకు మెరుగైన సేవలు



ఎమ్మిగనూరు పీఏసీఎస్ చైర్మన్‌గా గౌస్ పీరాతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయ పరపతి సహకార సొసైటీల ద్వారా మెరుగైన సేవలు అందిస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మిగనూరు పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న పీఏసీఎస్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి.. చైర్మన్ సోగనూరు గౌస్‌పీరా, డైరెక్టర్లు గుడికల్ దేవదాసు, కరణం రవి(జనసేన)లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార రంగంపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకొని ఇబ్బందులు పెట్టకుండా రుణాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ వేణుగోపాల్, మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, కూటమి నాయకులు రేఖాగౌడ్, నవీన్, నరసింహులు, జగ్గాపురం ఈరన్న, జగదీష్ నాయుడు, రాఘవేంద్ర నాయుడు, కేటీ వెంకటేష్, కమ్మ మహేంద్రబాబు, మాజీ ఎంపీపీ శంకరయ్య, సోమేశ్వర రెడ్డి, గోనేగండ్ల, నందవరం, హెచ్ కైరవాడి సొసైటీల చైర్మన్లు రామాంజనేయులు, ధర్మాపురం గోపాల్, తిమ్మారెడ్డి, మురళీ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తాం

ఎమ్మిగనూరు,ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా పాడైపోయి నాలుగు అడుగుల గుంతలు పడ్డ ఎమ్మిగనూరు - కమ్మళదిన్నె రోడ్డు పనులు వెంటనే చేపట్టాలని లేని పక్షంలో ఎమ్మిగనూరు, మంత్రాలయం ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ అన్నారు. గురువారం సీపీఎం ఎమ్మిగనూరు నాయకులు గోవిందు ఆద్వర్యంలో కమ్మళదిన్నె రోడ్డు వేయాలని మార్కెట్ కమిటి సర్కిల్‌లో పెద్ద ఎత్తున రాస్తారోఖో నిర్వహించారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింద్ఙి. ప్రజలు పడుతున్న ఇబ్బందులను సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే స్పందిస్తున్న రోడ్డు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అలాగే తాత్కాలిక మరమ్మత్తులకోసం త్వరలో చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు పీఎస్ రాధాకృష్ణ, పెద్దకడుబూరు తిక్కన్న, దేవదాసు, బసవరాజు, శ్రీనివాసులు, డీవైఎఫ్ఐ రాజేంద్ర, రైతుసంఘం నాయకులు లక్ష్మీనరసయ్య, అబ్దుల్లా, నరసింహులు, రమేష్, తిమ్మప్ప, వలి, ఆంథోని పాల్గొన్నారు.

ఎంఈవోపై చర్యలు తీసుకోవాలి

మంత్రాలయం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం ఎంఈఓ-1 పై విచారణ జరిగి వారం రోజులైనా చర్యలు ఎందుకు తీసుకోలేదని ఆర్‌యుఎస్ఎఫ్, ఆర్‌పీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు రఘునాథ్, ఆఫ్రీది ప్రశ్నించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు వత్తాసు పలుకుతున్న ఎంఈఓను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వారం రోజుల క్రితం ఆదోని డిప్యూటీ డీఈఓ వెంకటరమణారెడ్డి విచారణ జరిపి జిల్లా అధికారులకు నివేదిక పంపినా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఏమిటని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు అండగా నిలిచిన ఎంఈఓను సస్పెండ్ చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రఘు, వీరేష్, నవీన్, రాము పాల్గొన్నారు.

వైభవంగా మహా రథోత్సవం

● **ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి**

మంత్రాలయం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మహారథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో ముగింపు రోజైన గురువారం తుంగభద్రకు చేరుకున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులకు అక్కడి మేనేజర్ పురిడి నాగేషాచార్ ఆధ్వర్యంలో స్వామీజికి ఘనంగా స్వాగతం పలికారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య ప్రహ్లాదరాయలకు పూజలు చేసి రథంపై అధిష్టించి పీఠాదిపతులు మహామంగళ హారతులతో మహారథం ముందుకు సాగించారు. కార్యక్రమంలో జీకే రాఘవేంద్రాచార్, జీకే ప్రకాషాచార్, గౌతమాచార్ రామాచార్, ఫణీంద్రాచార్, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, శ్రీరామస్వామి, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ఎమ్మిగనూరు,ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మహాయోగి లక్ష్మమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఇన్‌చార్జి ప్రినిపాల్ డా. సుశీలమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు జాతీయజెండాను పట్టుకొని కళాశాలనుంచి ప్రధాన రహదారి వరకు తిరంగా ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ సుశీలమ్మ స్వాతంత్ర దినోత్సవ గొప్పతనాన్ని, స్వాతంత్ర పోరాటయోదుల గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కిరణ్ కుమార్ గౌడ్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా జెండా ఎగురవేయాలి



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పెర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయంలో జెండా ఊపి హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ ప్రారంభించారు, బైక్ ర్యాలీ సోమప్ప సర్కిల్, శివ సర్కిల్, అన్నమయ్య సర్కిల్ మీదుగా పార్క్ రోడ్డు వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా ర్యాలీ దేశ ఐక్యతను చాటడానికి, మనమంతా భారతీయులం కలసికట్టుగా ఉంటూ దేశ సార్వభౌమత్వాన్ని చాటాలన్నారు. ఆగస్టు 15వ తేదిన ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

పెద్దకడ బూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి పౌరులని జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు శంకరయ్య అన్నారు. గురువారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ఎలిషా, హసన్ పాల్గొన్నారు.

మిద్దె కూలినవారికి కొత్త గృహాలు మంజూరు

గోనెగండ్ల, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పదిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా గోనెగండ్ల, తిప్పనూరు గ్రామాలలో కూలీపోయిన గృహాలను గురువారం హౌసింగ్ ఏఈ షేక్షావలి, హౌసింగ్ సిబ్బంది పరిశీలించారు. గత నాలుగురోజు క్రితం గోనెగండ్లలో నాయిబ్రహ్మణ కాలనీలో మంగళి శారదమ్మ మట్టి మిద్దే, మంగళవారం రాత్రి తిప్పనూరు గ్రామంలో పింజరి ఖాజాబీ మట్టిమిద్దే వర్షంకు తడిసి కూలీపోయాయి. విషయం తెలుసుకున్న హౌసింగ్ అధికారులు గురువారం ఆయా గ్రామాలలో పర్యటించి మిద్దే కూలిపోయిన వారికి ప్రభుత్వం నూతన గృహాలను మందజూరు చేసిందని అందుకు గాను పీఎంఏవై 2.0 నందు అన్‌లైన్ చేయడం జరిగిందని హౌసింగ్ ఏఈ షేక్షావలి తెలిపారు.

రైతు మృతి

కోసిగి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దొడ్డి గ్రామానికి చెందిన గడ్డం హనుమంతు (55) అనే రైతు తన పొలంలోనే పత్తి పంటకు మందు పిచికారీ చేస్తూ కుప్పకూలిపోయాడు. పక్కనే ఉన్న కుమారుడు గోపాల్ తండ్రిని ఆదోని ఆసుపత్రికి తరలించారు. అయితే.. ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. గురువారం సాయంత్రం ఎప్పటిలాగే పొలంలో పనులు చేసుకుంటున్న రైతు హనుమంతు.. అందరితో అప్పటి వరకు బాగా మాట్లాడిన రైతు మృతి చెందడం బాధాకరం. అయితే రైతు హనుమంతు భార్య లక్ష్మి తెలిపిన వివరాల మేరకు తమకున్న ఐదెకరాల్లో పత్తి, ఉల్లి పంటలు సాగు చేశామని, గతంలో కూడా పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, ఇప్పటి వరకు 8 లక్షల మేర అప్పులు ఉండటం, ఈ ఏడాది కూడా ఉల్లి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో అప్పులు బాధ తాళలేక మనస్తాపానికి గురై మృతి చెందాడనీ భార్య లక్ష్మి తెలిపారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : స్రీ శక్తి పథకం భాగంలో మహిళలకు ఉచిత బస్సు వలన నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం నెలకు రూ 12వేలు ఆర్థిక సహాయం అందించి ఆదుకొవాలని సీఐటియు మండల కార్యదర్శి రాముడు, ఏపీ ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు నబి రసూల్, యాసీన్, రాజు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

కోసిగి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో ఈశ్వరయ్యస్వామి, ఇరిగేషన్ ఏఈ రవిప్రసాద్, సాగునీటి సంఘం అధ్యక్షులను రాష్ట్ర ప్రభుత్వం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించింది. సీఎం చంద్రబాబు తాలుకా, జిల్లా కేంద్రాల్లో సాగునీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులతో, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు, సాగునీటి సంఘం అధ్యక్షులకు సీఎం చంద్రబాబు ఈ కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

22న కన్నడ సాహిత్య సమ్మేళనం

మంత్రాలయం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 22న మంత్రాలయంలో అంతరాష్ట్ర కన్నడ సాహిత్య సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షులు గుడుగుంటి డాక్టర్ విఠల్ జోషీ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొదటి అంతరాష్ట్ర కన్నడ సాహిత్య సమ్మేళనం చరిత్రలో మొదటిసారిగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గోవా, మహారాష్ట్ర కర్ణాటక రాష్ట్రాల్లో సంయుక్తంగా, మంత్రాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశిస్సులతో జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మేళనాన్ని ప్రారంభిస్తారనీ తెలిపారు. ముఖ్యఅతిథులుగా ప్రముఖ కన్నడ సాహిత్యవేత్త సమ్మేళన అధ్యక్షులు ప్రదీప్ కుమార్ హెబ్రి, మహేష్ జోషి, పటేల్‌పాండు ఇందులో పాల్గొంటారనీ తెలిపారు. సాహిత్యపరిషత్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కిడ్నాప్ కేసుపై విచారణ

కోసిగి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా కేంద్రానికి చెందిన ఓ మైనర్ బాలికను అదే జిల్లాకు చెందిన ఓ యువకుడు మైనర్ బాలికను తీసుకువచ్చి కోసిగి రంగప్పగట్టు సమీపంలో తమకు తెలిసిన వ్యక్తి ఇంట్లో నాలుగు రోజుల పాటు ఆశ్రయం కల్పించడంతో ఫోన్ ట్రాకింగ్ ద్వారా రాయచూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కర్ణాటక పోలీసులు రెండు వాహనాల్లో గురువారం కోసిగలోని నాడగేనిగేరి, రంగప్పగట్టు కాలనీలో విచారణ చేసి రంగప్పగట్టు సమీపంలో కోసిగికి చెందిన ఓ యువకుడు కర్ణాటకకు చెందిన యువకుడు, మైనర్ బాలికకు ఆశ్రయం కల్పించడంతో కర్ణాటక పోలీసులు అక్కడే పంచనామా చేసి మైనర్ బాలికను తీసుకువచ్చిన కర్ణాటక యువకునిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.